

# విందులూ సంగీతాలూ !

చల్లా వారింట్లోకొచ్చి నాలుగాదివారాలయి పోయాయి. యదా ప్రకారంగా అమ్మ అత్తయ్య గారితో జట్టు కట్టేసింది. ఏపనసుకున్నా వదినగారూ అంటూ వాళ్ళవంటింట్లోకెళ్లిపోతుంది. ఇంక వాళ్ళ చంటి పాపాయయితే ఎప్పుడూ అమ్మతోనే !

అన్నీ బానే వున్నాయి కానీ రెండు విషయాలలో మాత్రం కాస్త జాగర్తగా వుండాల్సి

వస్తోంది. ఒకటి అత్తయ్యగారి మడి. రెండోది మావయ్యగారి కోపం. అది మా నాన్నకీ అప్పుడప్పుడు వస్తుంది గానీ ఇంట్లో కోపంగా వుంటే అమ్మతో కష్టం కదా. అందుకని కోపం వచ్చేటట్లుగా వున్నప్పుడే సిగరెట్టంటించుకుని వీధిలోకెళ్ళిపోతారు. పాపం మావయ్యగారు కూడా వుత్తనే ఎవరినీ ఏవీ అనరు. మనం ఆపకుండా లొడా లొడా మాట్లాడుతున్నావనుకో. మనకెంత ఇష్టమయిన మంచి టీచరయినా 'సైలెన్స్' అని గట్టిగా అరవరూ ! అలా గన్న మాట. పాటలు మాత్రం ఎంత గట్టిగా పాడుకున్నా ఏం అనరులే !

ఆవేళ నేనూ చిన్నారీ మొదటిసారి ఇల్లు చూడ్డానికొచ్చినప్పుడు గుమ్మంలోనే ఎదురయ్యారు గదా వాళ్ల తాతగారు. మరి తర్వాతెప్పుడూ కనిపించనే లేదు. మీ తెల్లజుట్టు తాతగారేరీ అనడిగితే జలజా పంకజా ఒకటే నవ్వులు మాకు తాతగారెక్కడున్నారని. ''నిన్ను ఆయన తిట్టారా?''అనడిగారు. ''చచ్చేలా'' అని చెప్పా.

''ఆయన మా తాతగారూ కాదు ఏవీ కాదు. పక్క వీధిలో రూం తీసుకుని ఒక్కరే వుంటారు. అప్పుడప్పుడు వచ్చి మేంసరిగ్గా సాధనచెయ్యడం లేదనో, చదువు కోవడం లేదనో కేకలేసి అమ్మ పెట్టిన టిఫిను తినేసి వెళ్ళిపోతారు. ఎవరెదురుపడితే వాళ్ళని తిడుతూ వుంటారు. అందుకే కాలేజి కుర్రాళ్లాయనికి పిచ్చి అంటారు గానీ పాపం చాలా మంచాయన'' అని చెప్పారు.

మరి జలజా పంకజా అందరికన్నా చిన్నవాళ్లు. పెద్దమ్మాయి లిద్దరికీ పెళ్ళిళ్లయి పోయాయి. మరి అయిదోవాళ్లెవరూ ? మీకు తెలియలేదు కదా. తనేనా ఫ్రెండు భాగ్యమ్మ - అంటే సౌభాగ్య లక్ష్మి. తనొక్కదాని పేరే విడిగా వున్నట్లు తన ఇష్టాలు కూడా మిగతా వాళ్ల కన్నా వేరే. సంగీతం అంటే పెద్ద ఇష్టం లేదు. కానీ లెఖ్ఖలు నాకన్నా తొరగా చేయగలదు. మా ఇద్దరి స్కూళ్లూ వేరు వేరు కాబట్టి కలిసి వెళ్లి రావడం కుదరదు గానీ కూరలకి కలిసెళ్ళొచ్చు గదా. రోజూ సాయంత్రం ఇద్దరం మావయ్యగారి వెనకాలే రెండు సంచులేసుకుని గవర్నరు పేట సెంటరు దాకా వెడతాం. ఆయన కూరలు కొని మా సంచీల్లో వేశాక గబగబా నడుచుకుంటూ వెళ్ళిపోతారు కదా. అప్పుడు మేం ఇద్దరం నెమ్మదిగా బోల్డు కబుర్లు చెప్పుకుంటూ అవి తెచ్చి హాల్లో పెట్టేస్తే మా డ్యూటీ అయిపోయినట్లే.

అపుడు క్రింద హాల్లో హడావిడి మొదలవుతుంది. అత్తయ్యగారూ మావయ్యగారూ వేటికవి విడగొట్టి ఏది కూర చెయ్యాలో దేన్ని పచ్చడి చెయ్యాలో ఎట్లా వండాలో అన్నీ నిర్ణయం చేశాక వదినొచ్చి ఆ పూట చేయాలిసినవి అట్టేబెట్టి మిగిలినవి కొట్టు గదిలోకి తీసికెళ్లిపోతుంది. ఆ గదినిండా బస్తాలకి బస్తాలు కందులూ, పెసలూ, మినుపులూ పాలాల్నించొచ్చినవి రెడీగా వుంటాయి. మాకుమల్లే పుస్తకం పట్టుకెళ్లి కొట్లోంచి తెచ్చుకోరుట.

కూర మాత్రం మావయ్యగారే తరుగుతారు. ఎవరు తరిగినా నచ్చదుట. ఈ లోపల వదిన దొడ్లో మెట్ల పక్కన కడిగేసి రెండు పొట్టుపొయ్యిలూ కూరి అంటించుచుంటుంది. రోలు శుభ్రంగా కడిగుంచుతుంది. మరి రోజూ కందిపచ్చడి రుబ్బాలి కదా అత్తయ్యగారూ ! ఈ పన్లయేలోపు అత్తయ్యగారు గబగబా బావి దగ్గర నీళ్లు తోడుకుని స్నానం చేసి రెండు బిందెల నీళ్లు పట్టుకుని తడి తడి బట్టలతోనే వంట దగ్గర కొచ్చేస్తారు. మావయ్యగారక్కడే కుర్చీ వేసుక్కూచుని ఆవిడతో ఏవేవో కచేరీ కబుర్లు చెప్తూ వుంటారు.

ఇంక ఈ ఇంట్లోకొచ్చాక అమ్మకి మాత్రం సాయంత్రం వంట తగ్గిపోయిందనే చెప్పచ్చు. మహా అయితే అన్నం ఒక్కటీ వండుతుందేమో. ఆవిడ వంటయిపోయాక పెరట్లో వాళ్ల గుమ్మం ముందు వాళ్ల పిల్లలూ మా వంటింటి గుమ్మం ముందు మేవూ కంచాలు పెట్టుకుని తింటుంటాం కదా ! చిన్న జాడీ గిన్నెలో పచ్చడి, పెద్ద మట్టి గిన్నెలో పులుసూ ములక్కాడలు తెచ్చి మా మధ్యన పెట్టేస్తారు. ఆవిడ పప్పు పులుసు పొయ్యిమీదుండే నోట్లో నీళ్లూరిస్తుంటే మా అమ్మ చేసే చారెవడికి కావాలి ? అసలే చారు చూస్తూనే జరం ఎవరికీ అని నాన్నడుగుతారు కదా. కొన్నాళ్లు పోయాక అమ్మచారు పెట్టడం మానేసింది ఒక్కత్తే తాగలేక ప్రాణం మీదకొస్తోందని చెప్పి.

శనివారాలు మాకు ఒక్కపూటే బడి కదా! అయినా ఇల్లు చేరేటప్పటికి రెండయి పోయింది. ఈ సగం సగం సెలవులెందుకిస్తారో తిక్కతిక్కగా. ఎటూ వెళ్లకా తప్పదు. రాకా తప్పదు. అటు ఇటు కాకుండా మిట్ట మధ్యాహ్నం ఇంటికొచ్చి ఏం చేస్తావని ? లోపలి కడుగు పెడుతుంటే కమ్మటి కాఫీ వాసనొస్తోంది. ఈ వేళప్పుడు ఇంత బాగా కాఫీ ఎవరు చేసుకుంటున్నారబ్బా అని అనుకుంటూ సంచీ అక్కడ పడేసి అటూ ఇటూ చూశా. అమ్మ రేడియో దగ్గర చేతిలో పుస్తకం పెట్టుకుని లక్షణంగా నిద్దరోతోంది. పెరట్లోకెళ్లి చూస్తే అత్తయ్యగారు పొయ్యి మీద పేద్ద నల్లమూకుడు కాలేసి కాఫీ గింజలు వేయిస్తున్నారు. ఒకటే పొగ. కనీసం వెనక్కి కూడా తిరిగి చూడకుండా దీక్షగా పరీక్ష రాసినట్లు వేయించేస్తున్నారు. అప్పుడు కూడా మడితోనే వున్నారు. పక్కనే రోలు కుంది రోకలితో పని మనిషినిలబడుంది. అది పోటేస్తే ఈవిడ జల్లించి డబ్బా కెత్తుకోవాలనుకుంటా.

'ఏంటత్తయ్యగారూ ! ఇన్నోటి కాఫీ గింజలు వేయిస్తున్నారెందుకూ'? అనడిగా.

''రేపట్నించీ ఆకాశవాణిలో సంగీతోత్సవాలు కదమ్మా! మరి అన్నీ తయారుగా పెట్టుకోవద్దూ''

సంగీతోత్సవాలకీ కాఫీ పొడికీ ఏంటబ్బా సంబంధం అని ఆలోచిస్తూ వీళ్లంతా ఏరీ అనడిగా. 'మేడమీదున్నారు వెళ్లు'' అన్నారు. ''పోనీ నే జల్లించేదా'' అనడిగా. ''వద్దు! వద్దు!

ఎంత సేపు! నిమిషంలో అయిపోతుంది. నువ్వు పైకి వెళ్లిపో'' అని మళ్లీ కలపడంలో పడ్డారు.

పైకెళ్లి చూస్తే వదినా, భాగ్యమ్మా జలజా అందరూ మేడమీద గదులూ, వరండాలూ తుడిచి సర్దేస్తున్నారు. చాపలూ, దిళ్లూ, దుప్పట్లూ, తువ్వాళ్లూ అన్నీ సెట్లు సెట్లుగా అమరుస్తున్నారు. ఏవిటర్రా అనడగితే వీళ్లు కూడా ''సంగీతోత్సవాలు కదా'' అని అన్నారు. అందరూ ఒకటే మాట. మళ్లీ మళ్లీ అడుగుదాం అంటే అటు చిన్నపిల్లనీ కాదు, పెద్ద పిల్లనీ కాదు. ఇంకా అడిగితే వెర్రి బాగుల్దాన్ననుకుంటారేమోనని భయంవేసి అదే తెలుస్తుందిలే అని వూరుకున్నా. సాయంత్రం బజార్లో కూరలు కొన్నాక నన్నూ భాగ్యమ్మనీ రిక్షా ఎక్కించి మావయ్యగారు వెనకా తలే నడుచుకుంటూ వచ్చారు.

పొద్దున్నే ఇంకా అమ్మా నాన్నా నిద్దర లేవనే లేదు. బయట బొయ్‌మని నాలుగయిదు కార్లాగినట్లు అనిపిస్తే కిటికీలోంచి చూశా. అన్నీ పెద్దకార్లు. చాలామంది దిగారు. రెండు మూడు తంబురాలూ, ఫిడేలు పెట్టెలూ, మద్దెలలూ కుండలూ దింపుతున్నారు. అందర్నీ మావయ్య గారు తిన్నగా మేడ మీదకి తీసికెళ్లిపోతున్నారు. అత్తయ్యగారు వీధిలో కనబడనే లేదు. బహుశా వంటింట్లో వుండుంటారనుకుని మా వంటింటి తలుపు తీసుకుని వాళ్లింట్లోకెళ్లా. ఆవిడ ప్రత్యేకంగా పాలు పొంగించి గ్లాసుల్లో పోసిపైన కాఫీ డికాషను చుక్కలేసి అటు ఇటు నురగొచ్చేలా తిరగబోస్తూ పరిమళాల కాఫీ చేస్తుంటే అప్పుడర్థమయింది నాకు ఆవిడ ఎందుకు నిన్నంత కష్టపడ్డారో ! నేనూ భాగ్యమ్మా గ్లాసులన్నీ పళ్లేల్లో పెట్టుకుని పైకెక్కుతుంటేనే ఒక చిన్నాయన ఎదురొచ్చి అవిపైకి పట్టుకుపోయారు. ఎంత మందున్నారో తెలియనే లేదు. మళ్లీ కిందకొచ్చి పని మనిషి చేత హాలంతా తుడిపించి దేవతార్చనకి సిద్ధం చేశారు. వాళ్లందరూ స్నానాలయ్యాక దేవతార్చన చేసుకోవాలి కదా. ఎవరి దేవుళ్లని వాళ్లే తెచ్చుకుంటారుట గదా !

అసలా వారం రోజులూ అత్తయ్యగారు మడి బట్టలో పొయ్యి ముందే. ఈ హడావిళ్లు అయేవరకు మా అమ్మని ఇంట్లో వంట చెయ్యొద్దని మావయ్యగారు ఆర్డరేశారు కదా. ఇంక అమ్మ కూడా అత్తయ్యగారి వెనకాలే తిరుగుతూ వంటలే వంటలు. నాకయితే స్వర్గంలా అనిపించిందనుకో ! నా జీవితంలో అన్ని రకాలు ఎప్పుడూ వినలే! చూడలే! పిన్ని పెళ్లిలో కూడా చెయ్యలే. సత్యప్రమాణంగా చెప్తున్నా. అరవ్వాళ్లో ఇంత మంచి మంచి వంటలుంటాయని నాకు తెలియనే తెలియదు సుమా !

ఒక్క సాంబారేనా, కూటేనా, అవియలేనా, మజ్జిగ పులుసేనా ! ఎన్ని రకాలో ! ఇలా వచ్చే మద్రాసు చుట్టాలకోసమని మావయ్యగారో వంటవాడిని పెట్టి నేర్పించారుట ఆవిడకీ వంటలు. ఆవిడ చేసే ఒక్కో మైసూరుపాకు జామెంట్రీ బాక్సంత వుంటుంది తెల్సా !

ఈ వారం రోజులూ రోజుకొక్కాళ్ల కచేరీ కదా రేడియోలో. వాళ్లందరూ మద్రాసు నించీ, తంజావూరు నించీ, మధుర నించీ, కుంభకోణం నించీ కదా వచ్చేది. కచేరీ వున్న పూట పొద్దున్నే మెయిల్లో దిగడం. రాత్రి మళ్లీ ఏ జి.టి.లోనో వెళ్లిపోడం. వాళ్లకి బోల్డు నియమాలు, నిష్ఠలూ బయట మంచినీళ్లు కూడా తాగరు. అందుకే ఏ కచేరి అయినా విడిది మా చల్లావారింట్లోనే. ఈవేళ పొద్దున్న కనబడ్డ వాళ్లు రేపుండరు. వీళ్లని చూడ్డానికీ, సంగీతం గురించి మాట్లాడ్డానికీ వూళ్లోనించి వచ్చే వాళ్లయితే ఎంత మందో !

అలా చూసి చూసి మా అమ్మకి గాభరా వచ్చేసింది. మరి అందరం రోజూ కచేరీకయితే వెళ్లాలి కదా. అత్తయ్యగారు పట్టుచీర కట్టుకుని తయారవుతుంటే ''వారం రోజుల నించీ చూస్తున్నా వదినగారూ ! వంచిన నడువెత్తకుండా చేసినవాళ్లు చేసినట్లున్నారు. ఈ నవకాయ పిండివంటలతో విందులు, ఎంత ఓపికండీ బాబూ మీకూ అన్నగారికీ ! వీళ్లెవరయినా మళ్లీ మిమ్మల్ని తల్చుకుంటారా ?'' అనడిగింది.

అత్తయ్యగారు నవ్వి ''సరస్వతీ రూపాలయిన వాళ్లు వచ్చి నా ఇంట్లో విస్తరేస్తే చాలదా! ఎన్ని జన్మల పుణ్యమో వాళ్లకే జన్మలో సరస్వతీ కటాక్షం కలిగింది. మాకు చేతనయినట్లు సేవించుకుంటున్నాం - ఇవి మామూలు భోజనాలు కావు వదినగారూ ! అమ్మవారే ఈ రూపంలో వచ్చిందనుకుంటాం మేం ఇద్దరం !'' అని 'పదవే పిల్లా! ఆలస్యంగా కచేరికి వెళ్లడం మర్యాద కాదు' అని నన్ను వెంటపెట్టుకు తీసుకుపొయ్యారు ఈ ఏడాదికి సంగీతోత్సవాలలో ఆఖరిదీ గొప్పదీ అయిన కచేరికి.